క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న గన్నిన సత్తిబాబు

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌కు సంబంధించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని సంబంధిత ఎత్తి పోతల పథకం కమిటీ ఉపాధ్యక్షుడు గన్నిన సత్తిబాబు కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదును అందజేసినట్లు ఆయన తెలిపారు. 750 హార్స్ పవర్ ట్రాన్స ఫార్మర్‌ను మంజూరు చేసి రైతులు ఇబ్బందులను తొలగించాలని, ఇప్పటికే ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా లేక పలు గ్రామాల్లో నాట్లు ఎండిపోయాయని కలెక్టర్‌కు వివరించగా సమస్య పరిష్కరానికి ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.

పశ్చిమడెల్టాలో మహిళ మృతదేహం లభ్యం


కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందర రావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కాల్వలో మహిళ మృతదేహం సోమవారం సాయంత్రం కొట్టుకు వస్తుండగా సమిశ్రగూడెం అన్నపూర్ణమ్మ హోటల్ రేవు వద్ద స్థానికులు గుర్తించి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం


ఊనగట్ల-నందిగంపాడు మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు

చాగల్లు: మండలంలోని నందిగంపాడు ఎడిసలమ్మ అమ్మవారి గుడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే పుంతరోడ్డును బీటీ రోడ్డుగా నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, నందిగంపాడు గ్రామ సర్పంచ్ కుదపా రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డును రూ.34 లక్షల నిధులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే జగనన్న కాలనీవాసులకు, పరిసర ప్రాంతాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలి

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేట, రాయిపేటలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయిపేటలో 1941లో స్థాపించిన హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, 8 మంది విద్యార్థులు ఉన్నారని వారిలో ఒక్క విద్యార్థి మినహా మిగిలిన అందరూ వైఎస్సార్ కాలనీ నుంచి వచ్చి చదువుకుంటున్నారన్నారు. ఇటు బసివిరెడ్డిపేటలో ఉన్న హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్లో ఆరుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారని ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు నివసించే ప్రాంతాంలో అందుబాటులో ఉండే విధంగా వీటి స్థానంలో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చెయ్యవలసిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. ఆ విధంగా చర్యలు తీసుకొవాలని విద్యాశాఖాధికారులను కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ లక్ష్మీపురం ఫీడర్ పరిధిలో ఆర్‌డీడీఎస్ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయానికి ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా ఉంటుందని ఆయన వెల్లడించారు.

మన్నించయ్యా గణపయ్యా

- జోరుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీ
- రసాయనాలతో పెనుముప్పు
- పర్యావరణవేత్తల గగ్గోలు


పట్టణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు


సమిశ్రగూడెం గ్రామంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారీ


గ్రామంలో విగ్రహాలకు మెరుగులు దిద్దుతున్న కళాకారులు

నిడదవోలు: గణనాథులు కొలువుదీరేందుకు ఇక పక్షం రోజుల సమయం ఉండడంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలోని పీఓపీ విగ్రహాల తయారీలో తలమునకలైన నిర్వాహకులు, విగ్రహాల ఆర్డర్లను పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. మరో వేపు వేడుకలకు ఆయా ఆలయ కమిటీలు ఊరువాడ నవరాత్రి ఉత్సవాల నిర్వాహణకు సన్నద్ధమవుతున్నాయి. మరోవైపు ప్లాస్టార్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం ఎక్కువగా నెలకొంటుందని సామాజిక వెత్తలు ఆందోళన చెందుతున్నారు. విగ్రహాల తయారీలో వినియోగించే రసాయనాలు కారణంగా నీటిలోని జలరాసులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఆ రసాయనాలు వల్ల నీటిని తాగే జనజీవరాశులు ప్రమాద భారీన పడతాయి. ఆ నీటి ద్వారా వచ్చే ఆహారం తినడం వల్ల అనారోగ్య లక్షణాలకు గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

జోరుగా అమ్మకాలు

రాజస్థాన్, హైదరాబాద్, విజయవాడ, వరంగల్, బెంగళూరు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారులు, వ్యాపారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న గుడారాలు ఏర్పాటు చేసుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో భారీ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. అడుగు నుంచి 15 అడుగుల ప్రతిమలను తీర్చిదిద్దిస్తున్నారు. పర్యావరణం కలుషితమవుతుందని సామాజికవేత్తలు విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్న ఈ విగ్రహాల వాడకం ఆగడం లేదు. ఫలితంగా అందమైన ఆకృతుల్లో నేత్రపర్వంగా రసాయన రంగులు దిద్ది విగ్రహాలకు ఆకర్షితులయ్యి కమిటీలు వాటికే మొగ్గుచూపుతున్నారు.

జీవకోటికి పెనుముప్పే..

వినాయక విగ్రహాల తయారీకి ఉపయోగించే రంగుల్లో మెగ్నీషియం, గంధకం, కాడ్మియం, జిప్సం, సీసం వంటి రసాయన పదార్థాలు ఉండడం వల్ల విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు కరగవని ఫలితంగా నీటి కాలుష్యం పెరుగుతోందని, ఈ రసాయనాలు వల్ల వాతావరణ కాలుష్యం కూడా జరుగుతోందని, ఇది జీవకోటికి పెనుముప్పుగా పరిగణస్తుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

అవగాహన లోపంతో..

లంబోదరుడి విగ్రహాలు ఆధునిక హంగులు, ఆకర్షణీయమైన రంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి పర్యావరణ కాలుష్యానికి మరింత ఊతమిస్తాయి. మట్టి గణపతులే మేలని, వాటిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కాలుష్య నియంత్రణ మండలి, పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పలువురు పర్యావరణ హితులు సమావేశాలు, సదస్సులు నిర్వహించి ప్రచారం చేస్తున్నా పెద్దగా మార్పు కనబడడం లేదు. ప్రజల్లో అవగాహన లోపంతో నూటికి 90 శాతం విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో రూపొందించినవే కనబడుతున్నాయి.

బాధ్యత తీసుకోవాలి

మట్టి వినాయక ప్రతిమల వినియోగంపై ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి. కాలుష్యాన్ని మిగిల్చే వాటికన్న మట్టి విగ్రహాలు వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వారమవుతామన్న భావన అందరిలో కలిగించాలి. ఆధునిక హంగులు, రసాయనాలతో కూడిన రంగుల విగ్రహాలను పూజించడం సమాజానికి హాని. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని, కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు ఎవరికి వారు బాధ్యత తీసుకోవాలి.

మట్టి విగ్రహాలనే వాడాలి



వినాయక ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహలనే వాడాలి. మట్టితో చేసిన గణపతి విగ్రహలను పూజించడం ద్వారా వాటి నిమజ్జన విషయంలో పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతోంది.

–పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, సిద్ధాంతి, నిడదవోలు


దేవరపల్లిలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

హోల్ సేల్ రేట్లకే విక్రయాలు

దేవరపల్లి: మండలంలోని అడుగు ఎత్తు నుంచి 10 అడుగల ఎత్తు వరకు విగ్రహాలను శిల్పులు చెక్కుతున్నారు. ముడిసరుకుతో పాటు కార్మికుల కూలీ రేట్లు పెరగడంతో రేట్లు పెంచుతున్నట్లు రాజస్థాన్‌కు చెందిన శిల్పి సురేష్ తెలిపారు. దేవరపల్లిలో దాదాపు 10 సంవత్సరాల నుంచి రాజస్థాన్‌కు చెందిన శిల్పులు ఇక్కడకు వచ్చి ప్రతిఏటా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నామన్నారు. సైజు, మోడల్‌ను బట్టి విగ్రహం ధర ఉంటుందని ఆయన చెప్పారు. దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తెలంగాణాలోని అశ్వారావుపేట, హైదరాబాద్‌లో బ్రాంచిలు ఏర్పాటు చేసి విగ్రహాలను తయారు చేసి హోల్ సేల్ రేట్లకు విక్రయిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఊరులోని విగ్రహాలు దర్శనమిస్తాయి. ముఖ్యంగా ఎంతో పవిత్రంగా భావించే వినాయక స్వామిని మట్టిలో కరిగిపోయే విగ్రహాలు వల్ల శాంతిస్తాడని..ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగకుండా రోజుల తరబడి విగ్రహాలు కరగకుండా చేసే పూజ కూడా ఫలించదని అర్చకులు చెబుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శలు


సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు, తదితరులు

చాగల్లు: ఊనగట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపిచంద్ తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న పార్టీ నియోకజవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. గోపిచంద్ స్వగృహం వద్ద ఆయన తల్లి సత్యవతి చిత్రపటానికి తలారి, పార్టీ నాయకులతో కలిసి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన తొర్లపాటి మునెమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చాగల్లు మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమని రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, సర్పంచులు మద్దుకూరి రవిప్రసాద్, కుదప రాంబాబు, ఉప్పులూరి సూరిబాబు, నాయకులు బొర్రా రజినిప్రసాద్, పిండి మంగరాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి రూ.20 లక్షల విరాళం


రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దాత లక్ష్మణరావు

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల గ్రామంలో వేంచేసియున రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ రాజగోపురం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయతో నిర్మిస్తున్న తూర్పు రాజగోపురం నిర్మాణానికి గ్రామానికి చెందిన దాత మొదలను లక్ష్మణరావు దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసి దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతలు యుద్దనపూడి సూరన్న, వరహాలమ్మ జ్ఞాపకార్థం వెంకటేశ్వర గాంధీ, సత్య కుమారి దంపతులు సుమారు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన అర్చకుల వసతి నూతన గృహాన్ని కొయ్యలమూడి చినబాబు, సుధారాణి దంపతులు, గన్నమని జనార్దనరావు ప్రారంభించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కూచిపూడి సతీష్, బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈదుపుగంటి వివరాంప్రసాద్, విజయ లక్ష్మి దంపతులు, కొయ్యలమూడి సురేంద్ర, మొక్కపాటి శ్రీనివాసరావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తావు లేకుండా పరిష్కరించాలి


కొవ్వూరు ఆర్డీవో కార్యాయలంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులోపే పరిష్కరించాలన్నదే పీజీఆర్ఎస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్-మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె నేరుగా స్వీకరించారు. మొత్తం 26 అర్జీలు అందాయని వారానికి రెండు రోజులు సంబంధిత శాఖల జిల్లా, డివిజన్ అధికారులతో సమావేశాలు నిర్వహించి అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి అర్జీని పూర్తిగా పరిశీలించి, దరఖాస్తుదారులు సంతృప్తి చెందే విధంగా చర్యలు చేపడతామన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మీకోసంలో వచ్చిన కొన్ని ఫిర్యాదులు..

కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కందుల సుబ్బలక్ష్మికి చెందిన 2.32 సెంట్లు భూమిని రీ సర్వే చేసి ధృవీకరణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కుమారదేవం గ్రామానికి చెందిన చదలవాడ మంగ లక్ష్మి రైతు భరోసా సొమ్ము జమకాలేదని, మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి


సమిశ్రగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ ప్రియాంక, అధికారులు

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకుని వివిధ రంగాల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సమిశ్రగూడెం సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, కాటకోటేశ్వరం, విజ్జేశ్వరం గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి, జాతీయ స్ఫూర్తి పెంపొందించాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

70 వీధిలైట్లు దగ్ధం

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడిలో 11 కేవీ విద్యుత్ తీగ తెగి వీధిలైట్ల లైన్‌పై పడడంతో సుమారు 70 వీధిలైట్లు దగ్ధమైనట్లు పంచాయతీ ఉప సర్పంచ్ కుసులూరి వెంకటసతీష్ తెలిపారు. సోమవారం జరిగిన ఈ సంఘటనలో సుమారు రూ.60 వేలు విలువ గల డిజిటల్ లైట్లు కాలిపోయినట్టు ఆయన వివరించారు. తరచూ ఈ ఘటనలు జరుతుండడంతో వీధిలైట్లు కాలిపోతున్నాయని ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకొవాలని కోరారు.

'కోడూరి' సాహిత్య సేవలు మరువలేనివి

సీటీఆర్ఐ: తెలుగు సాహిత్యానికి కోడూరి శ్రీరామమూర్తి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. కోడూరి శ్రీరామమూర్తి ఈ నెల 5వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన సాహిత్య కృషికి నివాళులర్పిస్తూ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ అరిపిరాల నారాయణరావు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు, తదితరులు చిత్రానికి పుష్పాంజలి ఘటించారు.

పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ


తాళ్లపూడి ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు


మాత్రల పంపిణీపై అధికారులకు వివరిస్తున్న డాక్టర్ గంగాధరరావు


కరపత్రాలను ప్రదర్శిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాతీయ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ పి.అన్నపూర్ణ తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 30 శాతం మంది పిల్లలు రక్తహీనత, ఆకలి లేకపోవడం, నీరసం బద్ధకం వంటి నులిపురుగుల రకాలైన రుగ్మతలతో బాధపడుతున్నారని, వాటిని నివారించాలంటే ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సంవత్సరం చిన్నారి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరు ఈ మాత్రలు వేసుకోవాలని ఆరోగ్యకేంద్రం పరిధిలోని 19 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 25 అంగన్వాడీ సెంటర్లలోని 3,515 మంది పిల్లలకు మాత్రల పంపిణీ చేస్తామని తెలిపారు. తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారిక మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 21 ప్రభుత్వ పాఠశాలలు, 13 ప్రైవేట్ పాటశాలలు, 32 అంగన్‌వాడీ సెంటర్లలో విద్యను అభ్యసిస్తున్న మొత్తం 6,527 మంది విద్యార్థులకు అందిస్తామన్నారు.

చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుద్దాం

నల్లజర్ల: చిన్నారులలో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టరు గంగాధరరావు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు మాత్రలు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాయలంలో ఎంపీడీఓ సింహాద్రిరావు ,మండల విద్యాశాఖాధికారి వై.సత్యనారాయణలతో ఆయన సమావేశమై మాత్రల వినియోగంపై సమీక్షించారు. 12వ తేది అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రలు మింగించాలని సూచించారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలో 89 విద్యా సంస్థలల్లో 14,148 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ ఇప్పటికే పూర్తయిందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

నులిపురుగు నివారణకు కృషి చేయాలి

ఉండ్రాజవరం: జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా నేడు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ 19 ఏళ్లవయస్సు పిల్లల అనారోగ్య సమస్యల నివారణకై ఆరోగ్య శాఖ అధికారులు సూచించిన విధంగా ఇబ్బంది లేకుండా మాత్రలు అందజేయాలని ఎంఈవో, ఐసీడీఎస్ పీవోలను ఆదేశించారు. ఎంపీడీవో వి.రామారావు మాట్లాడుతూ ఈ మాత్రలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి తీసుకుంటే వివిధ రకాల రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, ఎంఈవోలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్స్ కాంతారావు, పీహెచ్ఎస్ కె.కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం


కిడ్నీ వ్యాధిగ్రస్తుడుకి ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

నల్లజర్ల: చాదరాశిగుంట గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడు గుండుమోలు రామకృష్ణకు మండల మానవత సంస్థ సభ్యులు సోమవారం రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గుళ్లపూడి వెంకటరత్నం, ఆలపాటి సత్యనారాయణ, మండల కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడుకి అభినందనలు..

మానవత జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కండెపు వెంకట సూర్యనారాయణ దంపతులను జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు సోమవారం అభినందించారు. జిల్లా వ్యాప్తంగా మానవత సేవలు విస్తరింపజేయాలని వారికి సూచించారు.

సుంకవల్లికి నివాళులు..

దూబచర్లలో ఇటివల మృతి చెందిన మానవత సభ్యులు సుంకవల్లి వీరభద్రరావుకు మానవత సంస్థ సభ్యులు నివాళులర్పించారు. సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

నూతన హజ్ కమిటీ వేయాలి


షట్టర్ బాషా

ధవళేశ్వరం: సెంట్రల్ గవర్నమెంట్ జీవోకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం నియమించిన హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా వెంటనే రాజీనామా చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ కరీం బాషా (షట్టర్ బాషా) డిమాండ్ చేశారు. పవిత్రమైన హజ్ కమిటీలో ధార్మిక పండితులు మెంబర్లుగా ఉండాల్సిన స్థానంలో టీడీపీ కార్యకర్తలను నియమించిన కూటమి ప్రభుత్వం.. రాష్ట్రంలో ఉన్న ధార్మిక పండితులను చిన్న చూపు చూడడం సరి అయిన పద్ధతి కాదన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ జీవోకు విరుద్ధంగా ఏర్పడిన ఈ హజ్ కమిటీని కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ధార్మిక పండితులతో కూడిన కొత్త హజ్ కమిటీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

అర్జీలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ సిబ్బందిని ఆదేశించారు. నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. గ్రామాల్లో రీసర్వే చేపట్టి పలు భూ సమస్యలు పరిష్కరించాలని, రేషన్‌కార్డు, ఇళ్లు మంజూరు చేయాలని 8 మంది అర్జీలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి


స్వాధీనం చేసుకున్న సారా, డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది సోమవారం వెంకట నగరం గ్రామ పరిధిలోని రివ్వలగడ్డ లంకల్లో దాడి చేశారు. ఈ సందర్భంగా 4200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 280 లీటర్ల సారా, 100 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై నార్త్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. దాడిలో ఏఈఎస్ నాగ రాహుల్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, నార్త్‌స్టేషన్ ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు) 90100 51493 (నిడదవోలు)
79956 78554 90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com